సాక్షి వనపర్తి

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



ఆకట్టుకున్న అష్టావధానం

జడ్చర్లలో బుధవారం నిర్వహించిన సాహిత్య అష్టావధానం కార్యక్రమం ఆహుతులను ఎంతో ఆకట్టుకుంది.

-8లో ▸



కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

జూరాల ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ఉత్పత్తి కొనసాగినట్లు ఎస్ఈ శ్రీధర్ వివరించారు.

-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.9/23.4

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రత కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రోబోటిక్స్ వర్క్‌షాప్ విజయవంతం



వనపర్తిటౌన్: జిల్లాకేంద్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రోబోటిక్స్ వర్క్‌షాప్ విజయవంతమైందని ప్రిన్సిపాల్ డా. ఎన్‌వీఎస్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోబోటిక్స్ ప్రాథమికాలు, హార్డ్‌వేర్ అవగాహన, ప్రాజెక్టు డిజైన్ అండ్ బిల్డింగ్‌పై విద్యార్థులు శిక్షణ పొందారని చెప్పారు. విద్యార్థులకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకరోజు వర్క్‌షాప్, అనంతరం ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లు ఉంటాయని వివరించారు. విద్యార్థులు నేర్చుకున్న రోబోటిక్స్ పరిజ్ఞానాన్ని పాఠశాల విద్యార్థులకు బోధించనున్నారని దీంతో కళాశాల ప్రతిష్ట మరింత పెరగనుందని వివరించారు. సోహం అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్ వర్క్‌షాప్‌లో 147 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు వెల్లడించారు. రోబోటిక్ విద్యలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపేందుకు సోహం అకాడమీ కృషి చేస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. బీవీ రాంనరేష్ యాదవ్, డా. సీహెచ్ ఆశాజ్యోతి పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

పాన్‌గల్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి రజని సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పోక్సో చట్టం, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా నేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు అమలు చేస్తారో వివరించారు. జిల్లా లీగల్ అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ రఘు, ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇదెక్కడి చోద్యం..?

ప్రారంభం కాని రైస్‌మిల్లుకు ధాన్యం కేటాయింపు



పెద్దమందడి మండలం మదిగట్ల శివారులో నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్లు

- ప్లాస్టిక్ నీటి ట్యాంకుల పరిశ్రమను రా మిల్లుగా చూపించి..
- 5,410 బస్తాల బియ్యం సీఎస్‌సీకి అప్పగించిన వైనం
- బాయిల్డ్ మిల్లు ఏర్పాటుకు సన్నాహాలు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ క్షేత్రస్థాయి పరిశీలన నివేదిక ఉత్తిదేనా?

వనపర్తి: అధికారులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అడ్డగోలు అనుమతులు ఇస్తున్నారనేందుకు గత యాసంగిలో ధాన్యం కేటాయింపులను పరిశీలిస్తే అవగతమవుతోంది. ఓ పక్క కలెక్టర్ సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లులకు ధాన్యం కేటాయించొద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో పాటు పలు సమీక్షల్లోనూ వెల్లడించారు. కానీ పౌరసరఫరాలశాఖ అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ప్రారంభం కాని మిల్లుకు గత యాసంగిలోనే అక్షరాల 1.72 లక్షల బస్తాల ధాన్యం కేటాయించారు. మిల్లులో యంత్రాలు నడవకుండా బియ్యం ఎలా ఇవ్వగలరనే కనీస ఆలోచన చేయకుండా ధాన్యం కేటాయించడం.. అందుకు ఆయా శాఖల అధికారులతో కూడిన కమిటీ సైతం తప్పుడు నివేదికతో మోసం చేసి సంతకాలు చేసేంత అవసరం సదరు అధికారికి ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మరో విడ్డూరం..

ఇప్పటికీ ఇంకా మిల్లు ప్రారంభం కాలేదు.. రా మిల్లు పేరుతో ధాన్యం కేటాయించిన ఆ ప్రదేశంలో ప్రస్తుతం బాయిల్డ్ మిల్లు నిర్మాణం చేపడుతున్నారు. ఇటీవలే యంత్రాలు బిగించినా.. విద్యుత్ సరఫరా లేదు. కానీ తప్పుడు నివేదిక ఆధారంగా ఆయా శాఖలను తప్పుదోవపట్టించి తీసుకున్న ధాన్యానికి సంబంధించి ఇప్పటికే 5,410 బస్తాల బియ్యం సదరు మిల్లరు పౌరసరఫరాల కార్పొరేషన్‌కు అప్పగించారు. మిల్లే నడవకుండా బియ్యం ఎలా అప్పగించారనే విషయం అధికారుల వద్ద సైతం లేకపోవడం గమనార్హం. జిల్లాలో విచ్చలవిడిగా రేషన్ బియ్యం రీసైక్లింగ్ అవుతుందనేందుకు ఈ మిల్లర్ బియ్యం అప్పగించడమే ఉదాహరణగా చెప్పవచ్చు.

ఇదీ అసలు కథ..

వనపర్తి నియోజకవర్గంలోని పెద్దమందడి మండలం మదిగట్ల శివారులో ప్లాస్టిక్ నీటి ట్యాంకులు తయారయ్యే ఫ్యాక్టరీ ఉండేది. దీనిని రా రైస్‌మిల్లుగా చూపించి కోడ్ 43238 సంపాదించుకొని గత యాసంగిలో ధాన్యం తీసుకున్నారు. ఈ వ్యవహారం మదనాపురం మండలానికి చెందిన ఓ సీనియర్ మిల్లర్, ఇప్పటికే బ్లాక్ లిస్టులో ఉన్న వ్యక్తి నడిపించారు. తన పేరుతో ఇప్పటికే మిల్లు ఉండటంతో ధాన్యం కేటాయింపులు చేస్తే విషయం బహిర్గతం అవుతుందని పౌరసరఫరాలశాఖ అధికారి సలహా మేరకు అతను కొత్తకోట మండలం అప్పరాలకు చెందిన ఓ రేషన్ డీలర్‌తో ఒప్పందం కుదుర్చుకొని ఆయన పేరుతో మిల్లు నిర్వహణ అనుమతి పొంది అక్కడ వరి ధాన్యం మర ఆడించే యంత్రాలు లేకపోయినా ధాన్యం కేటాయింపులు చేయించుకునే విషయంలో సఫలీకృతులయ్యారు. రా మిల్లుకు భవిష్యత్ లేదని గుర్తించి అదే షెడ్‌ను మరింత పెద్దగా విస్తరించి బాయిల్డ్ మిల్లు నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికి ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్ సైతం సింగిల్‌ఫేస్ మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది.

క్షేత్రస్థాయి పరిశీలన చేపడతాం..



మిల్లు ప్రారంభించకుండా ధాన్యం కేటాయింపు సరికాదు. మదిగట్ల శివారులోని మిల్లును గురువారం సందర్శించి పరిశీలిస్తాం. మిల్లు ప్రారంభం కానిపక్షంలో నిర్వాహకులు, సంబంధిత అధికారులపై చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకుంటాం.

– ఖీమ్యానాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్



కొన్నిరోజుల కిందటే బిగించిన యంత్రాలు

కమిటీ తీర్మానం ఎలా సాధ్యం?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. కొత్త మిల్లుకు కోడ్ ఇచ్చి ధాన్యం కేటాయించాలంటే యజమాని చేసుకున్న దరఖాస్తును డీఎస్ఓ కార్యాలయంలో పనిచేసే ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. సాటెక్స్‌తో పాటు అగ్నిమాపక, విద్యుత్, పరిశ్రమలు, మార్కెట్‌శాఖ అనుమతి పొందారని నిర్ధారించుకొని పంచనామా నివేదిక సిద్ధం చేసి డీఎస్ఓకు అందజేయాలి. ఆయన ఈ నివేదికను కమిటీ ముందు ఉంచితే.. వారు సంతృప్తి చెంది అందరి ఆమోదం మేరకు రెవెన్యూ అదనపు కలెక్టర్ వద్దకు పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు సిఫారస్ చేసేందుకు దస్త్రం పంపిస్తారు. కమిషనర్ కోడ్ ఇచ్చిన తర్వాత ధాన్యం కేటాయింపులకు సైతం కమిషనర్‌కు పంపించాల్సి ఉంటుంది. కానీ మద్దిగట్ల మిల్లు విషయంలో నిబంధనలను తుంగలో తొక్కి ధాన్యం కేటాయింపులు చేసినట్లు స్పష్టమవుతోంది.



ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ నీటి ట్యాంకులు

విద్యార్థులను ప్రోత్సహించాలి



ఈవీఎం గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో ఉండే విద్యార్థులకు నిర్వాహకులు అండగా ఉండి చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, వసతిగృహ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యా సంస్థలో విద్యార్థి కమిటీ, ఫిర్యాదు పెట్టె ఏర్పాటు చేయాలని.. ఫిర్యాదు పెట్టె తాళం ప్రత్యేక అధికారి వద్ద మాత్రమే ఉండాలని సూచించారు. విద్యార్థి తన పేరు రాయకుండా సమస్యను కాగితంపై రాసి అందులో వేసేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి విద్యా సంస్థకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తూ వారంలో కచ్చితంగా తనిఖీ చేసేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని.. జటిలం కాకుండా చూడాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని.. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘనీ, జిల్లాలోని ఎస్ఓలు, సంక్షేమ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ..

ఈవీఎం గోదాం వద్ద పటిష్ఠ బందోబస్తు ఉన్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను త్రైమాసిక తనిఖీల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గోదాం తనిఖీ చేసి సమగ్ర నివేదికను అందజేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. గోదాం వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, సి–సెక్షన్ సిబ్బంది రాజేష్, నాగేంద్ర, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శంకర్, త్రినాథ్, పరమేశ్వరాచారి, కుమారస్వామి, జమీల్, ఇతర అధికారులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- ఎస్పీ రావుల గిరిధర్



సైబర్ వారియర్స్‌కు టీ షర్టులు అందజేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: మానవ తప్పిదంతోనే సైబర్ నేరాలు జరుగుతున్నాయని.. సైబర్ పోలీసులు ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సైబర్ పోలీసు వారియర్స్‌తో సమావేశం నిర్వహించి సైబర్ నేరాల నియంత్రణ, ఛేదించడంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సైబర్ వారియర్స్‌గా వారి అనుభవాలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నందున ప్రజలకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. జిల్లా సైబర్‌సెల్‌తో సమన్వయంతో పనిచేస్తూ సామాజిక మాధ్యమాల్లో అనుమానాస్పద కంటెంట్‌పై నిఘా ఉంచాలని, డిజిటల్ ఫోరెన్సిక్, సైబర్ ఇంటలిజెన్స్ సేకరణ వంటి బాధ్యతలను సైతం సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. బాధ్యతను నైతికంగా, చట్టబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం వారికి టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ మహేశ్వరరావు, సైబర్‌క్రైం ఎస్ఐ రవిప్రకాష్, డీసీఆర్బీ ఎస్ఐ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం

- పచ్చందాలను సంతరించుకున్న పాలమూరు
- 2014లో కేవలం 8.5 లక్షల ఎకరాల్లోనే సాగు..
- మూడేళ్లుగా అటూ ఇటు స్వల్పంగా మారుతున్న లెక్కలు
- ప్రస్తుతం అన్ని పంటలు కలిపి 18 లక్షల ఎకరాలకు పైగానే..

నాడు బీళ్లు.. నేడు సిరులు

పదేళ్ల క్రితం ఎటు చూసినా ఎండిన పంటలు.. బీళ్లుగా మారిన భూములు. ఫలితంగా ఉపాధి కోసం కుటుంబాలతో సహా తట్ట, బుట్ట, పార పట్టుకుని ముంబై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు బస్సుల్లో కిక్కిరిసి వెళ్తున్న హృదయ విదారక దృశ్యాలు ఇప్పటికీ కళ్ల ముందు కదలాడుతుంటాయి. అలా వలసలకు కేరాఫ్‌గా నిలిచిన పాలమూరు జిల్లా హరితవనంగా మారింది. సాగునీరు లేక నెర్రెలు బారిన వ్యవసాయ భూముల్లో సిరుల పంట పండుతోంది. ఏటేటా సాగు గణనీయంగా పెరుగుతుండగా.. భూమికి పచ్చని రంగు వేసినట్లు కొత్త శోభను సంతరించుకుంది.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

10 లక్షల ఎకరాల్లో పెరిగిన సాగు విస్తీర్ణం..

ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి 2014లో 8.50 లక్షల ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగు కాగా.. ప్రస్తుతం 18.50 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. ఈ లెక్కన 11 ఏళ్లలో 10 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో సాగు నీటి వసతి ఇంకా పెరగాల్సి ఉన్నప్పటికీ.. విస్తారంగా వర్షాలు కురవడం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం ఇస్తుండడం, రుణమాఫీ వంటి చర్యలు ఉమ్మడి జిల్లాలో సాగు గణనీయంగా పెరిగేందుకు దోహదపడ్డాయని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మూడేళ్లుగా 18 లక్షల ఎకరాలపైనే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానాకాలం సాగుకు సంబంధించి మొత్తంగా అన్ని పంటలు కలిపి 18 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యాయి. మూడేళ్లుగా కొంత అటు ఇటుగా స్వల్పంగా లెక్కలు మారుతూ వస్తున్నాయి. 2023లో 18,24,268 ఎకరాలు కాగా.. 2024లో 18,11,953 ఎకరాల్లో పంటలు సాగైనట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సాగు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 18,07,052 ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. అదును దాటే సమయానికి అంటే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మరో 50 వేల ఎకరాల్లో వరి నాట్లు పడే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

❐ ఉమ్మడి జిల్లాలో రైతులు ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఏటేటా వీటి సాగు గణనీయంగా పెరుగుతూ వస్తోంది. వరి 2023 ఖరీఫ్ సీజన్‌లో 7,76,311 ఎకరాలు, గతేడాదిలో 8,09,784 ఎకరాల్లో సాగు కాగా.. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 7,90,515 ఎకరాల్లో సాగైంది. మరో 50 వేల ఎకరాల్లో వరి సాగు కానుండగా.. 8.40 లక్షల ఎకరాలకు చేరుకోనుంది.

❐ ఉమ్మడి పాలమూరులో 2023లో 6,67,824 ఎకరాల్లో, 2024లో 6,04,004 ఎకరాల్లో పత్తి సాగు కాగా.. ఈ ఏడాది 7,05,739 ఎకరాల్లో రైతులు తెల్ల బంగారం పంట వేశారు. గతేడాదితో పోలిస్తే 1,01,735 ఎకరాల్లో పత్తి సాగు పెరిగినట్లు తెలుస్తోంది.

❐ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2023 వానాకాలంలో 1,00,816 ఎకరాల్లో, 2024లో 85,476 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఈ ఏడాది ఇదే సీజన్‌లో 1,09,708 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. గతేడాదితో పోలిస్తే 24,232 ఎకరాల్లో మొక్కజొన్న సాగు పెరిగినట్లు స్పష్టమవుతోంది.

❐ గతేడాదితో పోలిస్తే నాగర్‌కర్నూల్ జిల్లాలో 28,634 ఎకరాల్లో పంటల సాగు పెరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2,693 ఎకరాల్లో, నారాయణపేట జిల్లాలో 10,256 ఎకరాల్లో అధికంగా పంటలు సాగయ్యాయి. అదే వనపర్తిలో 28,216 ఎకరాల్లో, జోగుళాంబ గద్వాల జిల్లాలో 18,268 ఎకరాల్లో పంటల సాగు తగ్గినట్లు రికార్డులు చెబుతున్నాయి.

❐ గతేడాదితో పోలిస్తే మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి సాగు స్వల్పంగా తగ్గింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 40 వేలకు పైగా, గద్వాల జిల్లాలో 50 వేలకు పైగా ఎకరాల్లో అధికంగా రైతులు సాగు చేశారు. మొక్కజొన్నకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో గతేడాది కంటే 14 వేల ఎకరాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాలో 10 వేల ఎకరాల్లో అధికంగా సాగైంది.



ఆత్మకూర్ మండలం మూలమళ్ల శివారులో సాగు చేసిన వరి పంట

సాగు పెరిగింది.. పంట మార్పిడి చేయాలి



పంటల సాగు గణనీయంగా పెరిగింది. ఏటేటా వరి, పత్తినే అధికంగా పండిస్తున్నారు. ప్రతిసారి ఒకే రకమైన పంటలను సాగు చేయడం వల్ల భూమి చౌడు పొలంగా మారుతుంది. అన్ని రకాల పంటలు సాగు చేస్తేనే లాభదాయకంగా ఉంటుంది. జిల్లాలో గతేడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో మొక్కజొన్న సాగు పెరిగింది. పంట మార్పిడి చేసి కందులు, జొన్న, ఆముదం, ఇతర పంటలు కూడా సాగు చేస్తే.. భూసారం దెబ్బ తినదు.

– బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, మహబూబ్‌నగర్

జిల్లాల వారీగా సాగు వివరాలు (ఎకరాల్లో).. 2023-24

	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	నారాయణపేట	జో.గద్వాల
పంటల సాగు	3,45,731	4,38,847	2,61,208	4,11,768	3,66,714
వరి	1,92,849	1,46,481	1,87,545	1,67,532	81,904
పత్తి	85,663	2,36,054	17,424	1,82,515	1,46,168
మొక్కజొన్న	28,263	48,204	11,111	103	13,135
2024-25					
పంటల సాగు	3,48,783	4,36,242	2,41,618	4,11,442	3,73,868
వరి	1,94,983	1,57,376	1,96,200	1,71,527	89,698
పత్తి	82,482	2,20,582	14,721	1,53,014	1,33,205
మొక్కజొన్న	22,583	41,771	9,054	111	11,957
2025-26					
పంటల సాగు	3,51,476	4,64,876	2,13,402	4,21,698	3,55,600
వరి	2,06,910	1,36,406	1,78,747	1,82,134	86,318
పత్తి	80,097	2,67,079	15,831	1,57,584	1,85,148
మొక్కజొన్న	36,909	52,272	9,085	105	11,337

భూ సేకరణకు రైతులు సహకరించాలి



తూంకుంటలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రమణ్యం

వీపనగండ్ల: సింగోటం రిజర్వాయర్ నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు నిర్మించనున్న లింక్ కెనాల్ పనులు పూర్తి కావాలంటే భూ సేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీఓ సుబ్రమణ్యం కోరారు. మంగళవారం మండలంలోని తూంకుంట రైతువేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్వ నిర్మాణం పూర్తయితే చిన్నంబావి, వీపనగండ్ల, పెంట్లవెల్లి మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు పరిహారం అందించేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామని వివరించారు. మార్కెట్ ధరకు అనుగుణంగా ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలని రైతులు ఆర్డీఓకు విన్నవించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, భూ సేకరణ డిప్యూటీ తహసీల్దార్ ఆసీఫ్, డిప్యూటీ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆశన్న, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు..

పాన్‌గల్: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలిగించకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ సుబ్రమణ్యం ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిశీలనపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సులో జిల్లావ్యాప్తంగా 8,979 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 2,100 దరఖాస్తులను పరిష్కరించినట్లు వివరించారు. నిషేధిత భూముల వివరాలతో పాటు అసైన్డ్, సీలింగ్, వక్ఫ్, ఎండోమెంట్, అటాచ్‌మెంట్ భూముల వివరాలను మండలాల వారీగా సేకరిస్తున్నామన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా అధికారులకు నివేదించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వనపర్తిటౌన్: ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రవేశాలకు ఇంటర్‌బోర్డు గడువు పొడిగించినట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారంతో గడువు ముగియగా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు శుక్రవారం వరకు అవకాశం కల్పించిందని.. ప్రైవేట్ కళాశాలలో చేరేందుకు రూ.500 జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



స్వయం సమృద్ధి సాధించాలి

- స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

వివరాలు 8లో..

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధుడు మృతి


వెంకట్రామిరెడ్డి (ఫైల్)

మానవపాడు: పాము కాటుతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొర్విపాడులో బుధవారం జరిగింది. ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు.. మండలంలోని కొర్విపాడు గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి(77) ఉదయం సొంత పొలంలో కాడెద్దులతో దున్నుతుండగా గుర్తు తెలియని పాము కాటు వేసింది. స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపూర్(బాలానగర్): పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన బాలానగర్ మండలంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. వీరన్నపల్లి గ్రామానికి చెందిన తెలుగు ఎల్లయ్య(57) భార్య పద్మమ్మ 4 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతితో నాలుగు ఏళ్ల మనోవేదన వల్ల కుటుంబ సభ్యులతో బాధపడుతూ ఉండేవాడు. మంగళవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. చుటుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. అతని కుమారుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు బాలానగర్ ఎస్ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

బాలుడి మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: ఈనెల 7వ తేదీన చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు జూరాల లోయర్ జెక్(కృష్ణానది) గల్లంతైన మైనర్ బాలుడు బుధవారం రేకులపల్లి సమీపంలో లభ్యమైనట్లు రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. తెలుగు రాజేష్, తెలుగు చంద్రశేఖర్(13)లు చేపల వల వేసేందుకు వెళ్లారు. అనంతరం ఒడ్డుకు పుట్టిలో ఇద్దరు నిద్రపోయారు. జూరాలకు ఇన్‌ఫ్లో పెరగడంతో అలల తాకిడికి పుట్టి ముందుకు సాగుతూ కృష్ణానదిలో గల్లంతైయింది. తెలుగు రాజేష్ ఈత రావడంతో ప్రాణాలను కాపాడుకున్నాడు. నీటి ప్రవాహంలో గల్లంతైన చంద్రశేఖర్ ఆచూకీ లభించలేదు. బుధవారం నది నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో ఉదయం మృతదేహన్ని స్థానికులు గుర్తించారు. దీంతో మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాములు(ఫైల్)

పాన్‌గల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగనమోని రాములు (53) భీమా కాల్వలో ఉన్న బోరు మోటార్‌కు చుట్టుకున్న నాచు తొలగించేందుకు కాల్వలో దిగాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య బిచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

స్వయం సమృద్ధి సాధించాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు

- స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): స్థానికంగా ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా వినూత్న ఆలోచనలు, పద్ధతులతో స్థానిక సంస్థలు చిత్తశుద్ధితో పని చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో పాటు అనవసర వ్యయాన్ని తగ్గించుకొని ఆదాయ వనరుల రాబడిని పెంచుకున్నప్పుడే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు రమేష్, సంకిపల్లి సుధీర్‌రెడ్డితో కలిసి చైర్మన్ సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల కలెక్టర్లు విజయేందిర బోయి, బదావత్ సంతోష్, ఆదర్శ్ సురభి, బీఎం సంతోష్, నారాయణపేట అదనపు కలెక్టర్ రెవెన్యూ జిల్లాల వారీగా స్థానిక సంస్థల పనితీరును చైర్మన్‌కు వివరించారు. మున్సిపాల్టీలు, గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, తడి, పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు కొనసాగుతున్న కార్యక్రమాలు, గ్రాంట్స్ రూపంలో సమకూరుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా స్థానిక సంస్థలకు అందుతున్న ఆదాయం తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధులు, వాటి ఖర్చు వివరాలను గణాంకాల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా చైర్మన్ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మొదటగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థలు ప్రజలకు సమర్థవంతంగా వసతులు, సేవలు అందించాలని.. ఇందుకు అధికారులు అంకితభావంతో పని చేయాలని కోరారు. తడి, పొడి చెత్త నిర్వహణ అవలంబించి మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను కమిషన్ అధ్యయనం చేస్తోందని తెలిపారు. గ్రామపంచాయతీలు తడి, పొడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారుచేసి మహిళా సంఘాల ద్వారా విక్రయించవచ్చని, తద్వారా ఆదాయంతో పాటు భూ సారం పెరుగుతుందని వివరించారు. మూడు, నాలుగు పంచాయతీలు కలిసి క్లస్టర్‌గా ఏర్పాటు చేసుకొని చికెన్ వ్యర్థాలకు టెండర్ వేసి వచ్చిన ఆదాయాన్ని జనాభా ప్రాతిపదికన పంచుకోవచ్చని సూచించారు. కొత్త గ్రామపంచాయతీలుగా మారిన తండాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీధి దీపాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తే విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని.. ప్రయోగాత్మకంగా చిన్న గ్రామపంచాయతీల్లో అమలు చేస్తూ క్రమంగా అన్ని స్థానిక సంస్థలకు విస్తరించాలని తెలిపారు. పన్ను వసూళ్లు, ప్రకటనలపై వచ్చే రాబడి, వృత్తి పన్ను, వ్యాపార వాణిజ్య సముదాయాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించి నిర్ణీత రుసుం వసూలు చేస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ పురాతనమైంది..



పంచాయతీ రాజ్ వ్యవస్థ పురాతనమైందని.. రాజీవ్‌గాంధీ 73, 74 రాజ్యాంగ సవరణలతో అధికారాలు బదలాయించి వికేంద్రీకరించారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ మూడంచెల వ్యవస్థ ఏర్పాటు చేశారని.. గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి నేరుగా నిధులు వస్తున్నాయన్నారు. గ్రామానికి ఒక మాస్టర్ ప్లాన్ తయారుచేసుకొని ప్రాధాన్యత ప్రకారం పనులు పూర్తిచేస్తే అభివృద్ధి చెందుతాయని సూచించారు.

భవనాలు, సిబ్బంది లేరు..



పదేళ్లలో కొత్త మండలాలు, గ్రామాలు ఏర్పాటయ్యాయని.. చాలాచోట్ల భవనాలు, సిబ్బంది లేరని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తెలిపారు. సీనరేజ్, స్టాంపు డ్యూటీ స్థానిక సంస్థలకు రావడం లేదని, గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం కమిషన్ సభ్యుడు సంకిపల్లి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో పని చేస్తున్న అనుభవం ఉన్న అధికారులు ఆదాయ వనరుల పెంపునకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు, కార్యదర్శి కాత్యాయని, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, దేవ సహాయం, యాదయ్య, నర్సింగ్‌రావు, ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓలు వెంకట్‌రెడ్డి, యాదయ్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, పుర కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న రాఘవాచారి, పక్కన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు

- వనపర్తిలో పీడీఎస్‌యూ నాలుగో రాష్ట్ర మహాసభలు
- అక్టోబర్ 28, 29, 30న నిర్వహణ

వనపర్తి: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ నాల్గవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఎంఎన్ఆర్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో అక్టోబర్ 28, 29, 30 తేదీల్లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, ప్రధాన కార్యదర్శి సాంబ తదితరులు పీడీఎస్‌యూ కార్యకర్తలతో మాట్లాడారు. 70 మందితో ఆహ్వాన కమిటీను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపే విధంగా మహాసభల్లో చర్చించి విద్యార్థి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ఎంచుకోవాలన్నారు. విద్యను పేద వర్గాలకు అందని ద్రాక్షగా మార్చేలా పాలకవర్గాలు, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు విచ్చలవిడి అనుమతులు ఇస్తూ విద్యను వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. వీటికి వ్యతిరేకంగా పీడీఎస్‌యూ లాంటి విప్లవ విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామిక వాదులు, లౌకిక శక్తులు, మేధావులు, జర్నలిస్టులు, రచయితలు, కవులు, కళాకారులు, వ్యాపార వాణిజ్య వర్గాలు ఆదరించి మహాసభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు రాఘవాచారి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కవి జనజ్వల, జాతీయ నాయకుడు విజయ్‌ఖన్నా, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు, నారాయణ, పవన్‌కుమార్, రంజిత్, గణేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్య ప్రేరకాలను గుర్తించడం అవసరం


నాటకం ద్వారా ఆత్మహత్య నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎంబీబీఎస్ విద్యార్థులు

సీనియర్ మానసిక వైద్యనిపుణుడు అశోక్‌రెడ్డి

పాలమూరు: చిన్నచిన్న ప్రవర్తన మార్పులే వ్యక్తి మనోవేదనను సూచించవచ్చని, ఆత్మహత్య ప్రవర్తనకు దారితీసే ప్రారంభ సంకేతాలు, ప్రేరకాలను గుర్తించడం చాలా అత్యవసరం అని ఎస్వీఎస్ ఆస్పత్రి మానసిక వైద్య విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. ఎంతో ఒత్తిడిని ఎదుర్కొనే తర్వాతే ప్రాణం తీసుకోవాలనే ఆలోచన కల్గుతుందని, ఆత్మహత్యలను నివారించవచ్చని, మానసిక సమస్యలను గుర్తించి వాటికి సరిపడ వైద్య కౌన్సిలింగ్ తీసుకోవాలన్నారు. ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఎస్వీఎస్ మానసిక విభాగం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై ప్రత్యేక నాటక కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వ్యక్తులు సాయం కోరే విధంగా భయపడకుండా ముందుకు రావడానికి సహాయక వాతావరణం సృష్టించాలన్నారు. ఆ తర్వాత మానసిక ఆరోగ్యంపై ఎంబీబీఎస్ విద్యార్థులు ప్రత్యేక నాటకం ద్వారా ఒత్తిడి, ఆందోళన ఎదుర్కొనే వ్యక్తులు ఎలా ఉంటారో ప్రదర్శించి చూపించారు. ఎస్వీఎస్ నర్సింగ్ విద్యార్థులు మైమ్ ప్రదర్శనలో ఆత్మహత్య ముప్పులో ఉన్న వ్యక్తుల మానవేదనను ప్రతిబింబించే విధంగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ జోషి, డాక్టర్ హరిప్రసాద్, వెంకట్ రాహుల్, భార్గవ్ స్వరాజ్, వినీల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

⇨ ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలను ఒంటరిగా మోయరాదని, ఒత్తిడిని ఇంట్లో ఉండే కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల దగ్గర పంచుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానంగా యువత చదువు, భవిష్యత్‌పై సోషల్ మీడియా ఒత్తిడి ఎక్కువగా పెరిగిందని పిల్లలతో పెద్దలు తరచూ మాట్లాడాలన్నారు. ఒత్తిడిలో ఉన్న వారి కోసం పోలీస్ శాఖ ప్రధానంగా హెల్ప్‌లైన్ నంబర్లు, కౌన్సిలింగ్ సౌకర్యం అందుబాటులో పెట్టడం జరిగిందన్నారు.

ఆకట్టుకున్న సాహిత్య అష్టావధానం


అవధానం నిర్వహిస్తున్న వరంగల్ శ్రీరామ్, పృచ్ఛకులు (సాహితీవేత్తలు)

జడ్చర్ల టౌన్: కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీల పరిపాలనలో దాదాపు 600 ఏళ్ల తెలుగు భాష నిరాధారణకు గురైనప్పటికీ తన ఔన్నత్యాన్ని కాపాడుకుందని అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని చంద్రగార్డెన్‌లో ఆత్మీయ మిత్రమండలి ఆధ్వర్యంలో బి.శివకుమార్ నిర్వహించిన సాహిత్య అష్టావధాని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వరంగల్ శ్రీరామ్ అవధానిగా, సంధానకర్తగా కంది శంకరయ్య వ్యవహరించగా 8 మంది సాహితివేత్తలు పృచ్ఛకులుగా ప్రశ్నలు సంధించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ వతరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత లేని రోజుల్లోనూ తెలుగు భాష మనుగడ సాధించినా.. సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తున్న ప్రస్తుతం సమాజంలో ఇంగ్లిష్ చదువుల వల్ల తెలుగు మాట్లాడే వారి సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏడు వేల భాషలుండగా తెలుగు 11వ స్థానంలో ఉందని, భారతదేశంలో గతంలో రెండో స్థానంలో ఉండగా నేడు 4వ స్థానానికి పడిపోయిందన్నారు.

అష్టావధానం ఇలా..

అష్టావధానంలో మొదట నిషిద్ధాక్షరి అనే విభాగంలో కుంచకూరి బుచ్చిలింగం నిర్వహిస్తూ ఇప్పటి యువతకు ఆంజనేయుడు ఆదర్శం అనే అంశంపై పద్యం చెప్పమని కోరారు.

⇨ సమస్యాపూరాణం అనే రెండవ విభాగంలో.. చక్రవర్తుల రమణాచార్యులు నిర్వహిస్తూ హరిణము సమరమ్మునందు హస్తిని గూల్చెన్ (యుద్ధంలో జింక ఏనుగును చంపెన్) అనే సమస్యను ఇచ్చారు. కోరికయే ఏనుగుని మనసే జింక అని అవధాని సమస్యను పూరించారు.

⇨ దత్తపది అనే విభాగంలో దార్ల రాఘవేంద్రచారి నిర్వహిస్తూ కల్లు, రమ్ము, బీరు, సారా అనే పదాలతో గణేషుడిని పూజించాలని చెప్పారు.

⇨ న్యస్తాక్షరి అనే విభాగంలో యలకంటి భాస్కర్ నిర్వహిస్తూ య, ల, కం, టి అనే నాలుగు అక్షరాలు నాలుగు పాదాల్లో ఎక్కడెక్కడ రావాలో పేర్కొంటూ ప్రపంచ దేశాల్లో భారత ప్రధాని మోదీకి దక్కుతున్న గౌరవం గూర్చి శార్దూల వృత్తంలో చెప్పమన్నారు.

⇨ వర్ణన అనే విభాగంలో కిరణ్మయి నిర్వహిస్తూ సభాధ్యక్షులు శివకుమార్‌ను శ్రీకృష్ణదేవరాయలుగా, పృచ్ఛకులను అష్టదిగ్గజాలుగా వర్ణించమన్నారు.

⇨ ఆశువు అనే విభాగాన్ని మరింగంటి కృష్ణవేణి నిర్వహిస్తూ ప్రస్తుతం విద్యార్థులు ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌లోనే గడుపుతున్నారని దాని దుష్ఫలితాల గూర్చి అప్పటికప్పుడు పద్యం చెప్పమన్నారు. అవధాని ఆశువుగా పద్యాన్ని చెప్పారు.

⇨ చందోభాషణం అనే విభాగంలో పూదత్తు కృష్ణమోహన్ పద్యరూపంలో అవధానితో మాట్లాడారు. అప్రస్తుత ప్రసంగం అనే విభాగాన్ని సాకేత్‌ప్రవీణ్ నిర్వహించారు.

మార్కెట్‌లోకి హోండా సీబీ 125 హార్నెట్


నూతన బైక్‌లను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఆర్టీఓ రఘుకుమార్, నర్మద హోండా ఎండీ వేణుగోపాల్‌సింగ్

పాలమూరు: హోండా కంపెనీ నుంచి మార్కెట్‌లోకి మరో రెండు నూతన మోడల్ ద్విచక్ర వాహనాలను విడుదల చేశారు. జిల్లా కేంద్రంలోని నర్మదా హోం షోరూంలో బుధవారం హోండా సీబీ 125 హర్నెట్, హోండా షైనీ 100డీఎక్స్ ద్విచక్ర వాహనాలను ఆర్టీఓ రఘుకుమార్, నర్మద హోండా ఎండీ వేణుగోపాల్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పోర్ట్స్ బైక్ ప్రేమికుల కోసం హోండా సీబీ 125 హర్నెట్ అద్భుతంగా ఉంటుందని, ఐదు గేర్లు, సైలెంట్ స్టార్ట్ ఏసీజీ, 4.2అంగుళాల టీఎఫ్‌టీ డిస్‌ప్లే, బ్లూటూత్ కనెక్టివిటీ, కాల్, ఎస్ఎంఎస్ అలర్ట్స్, నావిగేషన్ సదుపాయం ఉందన్నారు. యూఎస్‌బీ ఛార్జింగ్, ఎల్ఈడీ హెడ్‌లైట్లు ఇన్‌బిల్ట్‌గా వస్తాయన్నారు. షోరూం ధర రూ.1.12లక్షలు ఉండగా ఆన్‌రోడ్ ధర రూ.1,36,495లకు లభిస్తుందన్నారు. ఇక హోండా షైనీ 100డీఎక్స్ ఫ్యామిలీ వినియోగదారులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజ్ ఇస్తూ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 65 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తోందని, 4 స్ట్రోక్ ఇంజిన్, 4 స్పీడ్ గేర్ బాక్స్, ఓబీడీ-2బీ కంప్‌లైంట్, డిజిటల్ క్లస్టర్, సైడ్ స్టాండ్ ఇంజిన్‌కట్ ఆఫ్ ఉంటుందన్నారు. షోరూం ధర రూ.75,950 ఉండగా ఆన్‌రోడ్ ధర రూ.92,172లకు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ బాలీశ్వర్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఊర్కొండ: పోక్సో కేసు నమోదయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన శివప్రసాద్ అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఊర్కొండ: మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని రేవల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ప్రకారం గ్రామానికి చెందిన భవాని (26) భర్తతో విభేదించి విడాకులు తీసుకొని 18 నెలలుగా నుంచి గ్రామంలోని తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి గ్రామ శివారులోని పాడుబడిన బావిలో భవాని శవం నీటిపై తేలాడుతుండగా స్థానికుల గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ కృష్ణదేవ బావి నుంచి మృతదేహన్ని బయటకు తీసి కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం

ఆత్మకూర్: జీవితంపై విరక్తితో యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలో జరిగింది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని గార్లగుట్టకు చెందిన షేక్ కరీం(21) బుధవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. ఆర్థిక పరిస్థితులు, అప్పుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్ట్


అమరవాయిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

మల్దకల్: కొంతకాలంగా గద్వాల, జడ్చర్ల, వనపర్తి, పెబ్బేరు, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో అపహరణకు గురైన మోటార్ సైకిళ్లను జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని అమరవాయిలో బుధవారం కర్నూల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమరవాయిలో 25 బైక్‌లను పోలీసులకు పట్టుబడడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా.. గద్వాల పట్టణానికి చెందిన జశ్వంత్ వారం రోజుల క్రితం కర్నూలు పట్టణంలో మోటార్ సైకిల్‌ను దొంగలించడంతో కర్నూలులోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో సీఐ నాగరాజురావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం మోటారుసైకిల్ చోరీపై విచారణ చేపట్టి గద్వాల పట్టణానికి చెందిన జశ్వంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విచారించగా 30కు పైగా బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో సీఐతో పాటు పోలీసు సిబ్బంది మహేందర్, రవి, శ్రీను అమరవాయికి చేరుకొని జశ్వంత్‌కు సహకరించిన బోయ వీరేష్, పాండు, బోయ పాండులను అదుపులోకి తీసుకున్నారు. వారి విచారణలో జశ్వంత్ చోరీ చేసిన బైక్‌లను గ్రామంలోని కొంతమంది రైతులు, వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. దొంగలించిన బైక్‌లను కొన్న యజమానులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించడంతో వారు బైక్‌లను పోలీసులకు అప్పగించారు. అమరవాయిలో 18, బిజ్వారంలో 2, సద్దలోనిపల్లి, అయిజ, మల్దకల్ తదితర గ్రామాల్లో 25 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన వాటిని త్వరలోనే స్వాధీనం చేసుకుంటామన్నారు. తక్కువ ధరకు వచ్చే వాహనాలను ఎవరూ కొనుగోలు చేయొద్దని ప్రజలకు సూచించారు. వాహనాలు కొనుగోలు చేసే సమయంలో అమ్మే వారి నుంచి ఆధార్, ఆర్సీ, లైసెన్సులు తప్పనిసరిగా పరిశీలించాలన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట/రాజోళి: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో బుధవారం ఉత్పత్తి కొనసాగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 307.048 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 333.081 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు వివరించారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 640.129 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు.

⇨ ప్రియదర్శిని జూరాల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. విద్యుదుత్పత్తి నిమిత్తం 32,917 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ఆవిరి రూపంలో 94 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 650, సమాంతర కాల్వకు 800, భీమా లిఫ్ట్-2కు 750 క్యూసెక్కులు వినియోగించినట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9,070 టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద..

సుంకేసుల జలాశయానికి బుధవారం ఎగువ నుంచి 34,432 క్యూసెక్కుల వరద రాగా..7 గేట్లను మీటర్ మేర తెరిచి 30,415 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ మహేంద్ర వివరించారు.

శ్రీశైలంలో 883.1 అడుగుల నీటిమట్టం..

శ్రీశైలం జలాశయంలో బుధవారం 883.1 అడుగుల నీటిమట్టం.. 205.2258 టీఎంసీల నీటి నిల్వ ఉందని అధికారులు వివరించారు. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,917 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 24,464 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుందన్నారు. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,744 క్యూసెక్కులు దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు చేరుతున్నట్లు వివరించారు. భూగర్భ కేంద్రంలో 16.942 మి.యూ., కుడిగట్టు కేంద్రంలో 15.221 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టారు.

ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆర్డీఓ విచారణ



మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌కు చెందిన రైతు గజ్జల జంగమ్మ, ఆమె కుమారుడు గజ్జల కృష్ణయ్య సోమవారం తహసీల్దార్ ఎదుట పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై బుధవారం మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ కుమార్ బుధవారం గ్రామస్తుల సమక్షంలో సర్వేనెంబర్ 156 వద్ద విచారణ చేపట్టారు. తాత, ముత్తాతల కాలం నుంచి ఉడ్డాల లెక్కన పంచుకున్నామని, మూడు, నాలుగు సర్వే నంబర్లలో ఒక్కొక్కరికి ఒకటి, మూడు, నాలుగు గుంటల భూమి ఉండడంతో అప్పట్లో సాగు చేయడం ఇబ్బందిగా ఉంటుందని ముగ్గురు ముత్తాతలు మూడుచోట్ల పంచుకున్నారని, ఎవరి భూమిపై వారు మోఖాపై ఉన్నారని గ్రామస్తులు ఆర్డీఓకు వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. సమస్యను అందరు కూర్చొని మాట్లాడుకోవాలని సూచించారు. అలాగే రైతు జంగమ్మ కుమారుడు కృష్ణయ్య తాను ఈ విషయంలో తొందరపడ్డానని.. తనదే తప్పని తహసీల్దార్ యూపీరాజుకు లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. ఆర్డీఓ వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.